నిప్పు చిన్నదిగా కనిపించవచ్చు కానీ, అది రగిలితే కలిగే ముప్పు యెంత పెద్దదో అర్థమయితే...!

# "పందెం."

"ఎంతెంత ?"

"ఐదు."

"చాల తక్కువ"

"సరే! పది రూపాయలు."

"ఓ. కే. పందెం నేనె గెలుస్తాను. పది రూపాయలు రెడీగా వుంచు" అన్నాడు రహీమ్.

"నీవు పందెం గెలిచినప్పుడుగదా సెనిచ్చేది" ప్రకాశ్ అన్నాడు.

"తప్పకుండాగెలుస్తాను. చూస్తూండు".

ప్రకాశ్, రహీమ్ ఇద్దరూ ఒకే ఈడు వాళ్ళు. చిన్నప్పటినుంచి స్నేహితులు. చదివేది ఇద్దరూ ఒకే కాలేజి కాబట్టి సన్నిహితులుగా వుంటారు ఎప్పుడూ. ఆ రోజు ఆదివారం కాలేజీకి సెలవు కాబట్టి రహీమ్ ఇంటి దగ్గర ఇద్దరూ రోడ్డుమీద కబుర్లు చెప్పుకుంటున్నారు. ప్రకాశ్ యిల్లు ప్రక్క సందులో వుంది. ఇంతలో ఎదురుగా దూరం నుంచి ఓ మెరుపు తీగె వారి వైపుగా వస్తుండగా ప్రకాశ్‌కివూరుకో బుద్ధి కాలేదు. ప్రకాశ్‌కి పందెం కాసి ఎదుట వారిని ఓడించడమంటేమహాసరదా.

మెరపుతీగెను చూడగానే తళుక్కున మెరపులా ఓ ఐడియా వచ్చింది. అది వెంటనే అమలుపరచదలచాడు. "ఆ అమ్మాయి పైట లాగి, చేయి పట్టుకుంటే పది రూపాయ లిస్తానని" పందెం కాశాడు రహీమ్‌తో. రహీమ్‌ది దుడుకు స్వభావం. వెనకాముందుఆలోచించేంతపరిజ్ఞానంలేదు. మనసుకు ఏది తోస్తే అది చేసెయ్యవలసిందే. మనిషి అందంగా, దృఢంగా వుంటాడు. వ్యాయామం చేసే శరీరం. అందుకే ఏం చేసినాచెల్లిపోతుందనే ధీమా. నిజానికి రహీమ్‌తో తగులాట పెట్టుకోవాలంటే ఆ బస్తీ వాళ్ళకి భయం.

మెరపుతీగ రాను రాను దగ్గరవుతుంది.

"రహీమ్ మళ్ళీ ఆలోచించు. వాళ్ళ అన్నగోపాల్ బాక్సర్. వాడికితెలిసిందంటే మక్కెలిరగ దంతాడు."

"వాడు నన్ను తంతాడో, తన్నిచ్చుకుంటాడో తరువాత చూద్దువుగానీ ముందు నీవైతే పది రూపాయలు తీసుంచు. షరత్ నేనే గెలుస్తాను."

"సరే అదీ చూస్తాను."

రహీమ్ అటూ యిటూ చూసి గబుక్కున రోడ్డు క్రాస్ చేసి ఆ అమ్మాయి యెదురుగా తల వంచుకుని చూడనట్లుగా వెళ్ళగట్టిగా తన బుజాన్ని ఆమె బుజానికేసి కొట్టాడు. అమ్మాయి క్రింద పడబోయి నిలద్రొక్కుకుంది. కానీ, చేతిలో పుస్తకాలు జారిక్రింద పడిపోయాయి. సిగ్గుతో, కోపంతో, అవమానంతో ఆ అమ్మాయి క్రిందపడిన పుస్తకాలని తీసుకోవడానికి క్రిందికి వంగింది. ఆ వంగడంలో వేసుకున్నది టెరిలిన్ చీర కావడంతో పైట జారిపోయింది. నడిరోడ్డుమీద పైట జారిన అమ్మాయి పరిస్థితి ఎంత ఘోరంగా, దయనీయంగా వుంటుందో వూహించ నక్కరలేదు. ఆ అమ్మాయి కళ్ళల్లో నీళ్ళు తిరిగాయి. వస్తున్న దుఃఖాన్ని దిగ మింగుతూ పైట సరిచేసుకుని పుస్తకాలు గబగబ క్రిందనుంచి తీసి రహీమ్‌ను ఒకసారి మింగేసేలా చూసి మళ్ళీ తల వంచుకుని గబగబ అక్కడనుంచి వెళ్ళిపోయింది రోడ్డుమీద అందరూ చూస్తుండగా.

అక్కడవున్న ప్రజలకి రహీమ్ చేసిన పని అసభ్యకరంగానూ, జుగుప్సాకరంగానూ వున్నా నిరసన ప్రకటించి రహీమ్‌ను మందలించే ధైర్యంలేదు. ఎవరి పాటికి వాళ్ళు మనకెందుకులే అని వూరుకున్నారు. రహీమ్ వెకిలిగా నవ్వుతూ, ప్రకాశ్ దగ్గరకు వచ్చి "షరత్ మై జీతా దస్ రుపియా నికాలో" అన్నాడు.


వుడుకు రక్తంతో ఏదో పందెం కాసినా రహీమ్ చేసిన పని ప్రకాశ్‌కెందుకో బాధ కల్గించింది. పందెం కాయకపోయినా బాగుండేది అనుకున్నాడు.

"మేరే పాస్ అభీ పాంచ్ హై, అవురేక్ పాంచ్ కల్ దేతావూ" అన్నాడు ప్రకాశ్.

"నహీ చలేగా! అభీ దస్‌హోనా" అన్నాడు రహీమ్.

"సరే పందెం నేను కాశాను కాబట్టి నీవు ఇక్కడే వుండు. ఇంటికి వెళ్ళి ఇంకో ఐదు రూపాయలు తీసుకుని వస్తాను," అంటూ ఇంటివైపు నడిచాడు. రహీమ్ ఒక్కడే రోడ్డుమీదున్న లైటు స్తంభానికి ఆనుకుని ప్రకాశ్ గురించి ఎదురు చూస్తున్నాడు. ఇప్పుడే ఇంటికి వెళ్ళి పది రూపాయలు తీసుకుని వస్తానన్న ప్రకాశ్ పావుగంటయినా రాలేదు. రోడ్డుమీద నిలబడిఅన్నివైపులా చూస్తున్న రహీమ్ వున్నట్టుండి వులిక్కిపడ్డాడు.

ఆ సందు చివరగా నిలబడి వుంది ఇందాక తను డాష్ ఇచ్చిన అమ్మాయి. ప్రక్కన ఎవరో సైకిలు పట్టుకుని నిలబడి వున్నారు. ఆ అమ్మాయి ఏదో చెబుతూ తన వైపు చేయి చూపిస్తోంది.





# పందెం ఖరీదు....?

యం. చంద్రశేఖర

అతను తల వూపుతూ వింటున్నాడు. మధ్య మధ్య తను వున్న వైపు చూస్తూ. రహీమ్‌కి అక్కడ నుంచి తప్పుకోవడం మంచి దన్పించింది. అయినా అక్కడ నుంచి కదలడానికి 'అహం' అడ్డు వచ్చింది. తన నెవరేమి చేయగలరన్న ధీమాతో అలాగే నిలుచున్నాడు.

రెండు నిముషాల తరువాత చూస్తే సందు చివర ఎవరూ లేరు. రహీమ్ తనలో తను నవ్వుకున్నాడు. తనతో తలబడేవాడు ఆ బస్తీలో ఎవడూ లేడని.

ఓ పది నిముషాల తరువాత ఎడంవైపు సందునుంచి. కుడివైపు సందులోనుంచి రెండు సైకిళ్ళలో నలుగురు మనుష్యులు దిగారు. సైకిళ్ళకు స్టాండు వేసి ఆ నలుగురూ తనవైపు రావడం చూశాడు రహీం. వాళ్ళను అంతకు ముందెన్నడూ చూసినట్లు గుర్తులేదు.

రహీమ్ చూపులు దూరంగా వున్న ఇంకొక వ్యక్తిమీద పడ్డాయి. ఆ వ్యక్తిని చూసిన రహీం ముఖంలో కత్తివాటుకి నెత్తురు చుక్క లేకుండా పోయింది. అవును. అతనే. యిందాక ఆ అమ్మాయి యితనికే తనని చూపించింది. బహుశ ఆ అమ్మాయి అన్నయ్య "గోపాల్" అనుకుంటాను. ప్రకాశ్ చెప్పినదాన్నిబట్టి భారీశరీరం బాక్సర్ లాగానే వున్నాడు.

రహీమ్ క్షణంలో తను ఏ పరిస్థితులలో చిక్కుకున్నది వూహించుకోగలిగాడు. తను ప్రమాదంలో వున్నాడు. వాళ్ళయిదుగురు. తను ఒక్కడు. లాభం లేదు. వెంటనే ఇక్కడనుంచి పారిపోవాలి. అనుకుని కదలబోయేంతలో నలుగురిలో ఇద్దరు పరిగెత్తుకుంటూ వచ్చి రహీమ్‌ని ఒడిసి పట్టుకున్నారు. ఇంకో ఇద్దరు రహీమ్‌ను ఎక్కడబడితే అక్కడ కొట్టసాగారు. రహీమ్ నోట్లో ముక్కులో నుంచి రక్తం కారసాగింది. అయినా వాళ్లు వదలలేదు. చుట్టుప్రక్కల జనం మూగారు. అందరూ చూస్తూ నిలబడ్డారేతప్ప ఎవ్వరూ ముందుకు వచ్చి రహీమ్‌ని రక్షించడానికి పూనుకోలేదు.

"వాడ్ని ఎంత కొట్టినా లాభంలేదురా! ఇక మీద రోడ్ల మీద వెకిలిచేష్టలు చేస్తూ అమ్మాయిలను ఏడ్పించకుండా ఈ నాయాల్ని శాశ్వతంగా మూసివేయాలి. వీడికిదే తగిన శాస్తి" అంటూ జేబులో నుంచి ఆరంగుళాల నిడివిగల కత్తితీశాడు గోపాల్.

కత్తి తీయడం చూడగానే అక్కడ

## ఆంధ్రజ్యోతి సచిత్ర వారపత్రిక

### చందా రేట్లు

| | ఏజెంటు ద్వారా | పోస్టు ద్వారా |
|---|---|---|
| 3 నెలలకు | 11—70 | 12—35 |
| 6 నెలలకు | 23—40 | 24—70 |
| 12 నెలలకు | 46—80 | 49—40 |

విడి ప్రతి వెల 0.90 పైసలు

సర్క్యులేషన్ మేనేజరు,
ఆంధ్రజ్యోతి,
P.B. No. 712, విజయవాడ-10.



## కావలెను

పాక్షిక సమయంలో శక్తి సూటింగ్ షర్టింగ్ మరియు చీరల అమ్మకం అభివృద్ధి చేయుటకు జీతం లేదా కమీషన్‌గా నెలకు రు. 700/- సంపాదించుటకు ఏజెంట్లు కావలెను. ఉచిత సాహిత్యం మరియు శాంపిల్స్ కోసం దరఖాస్తు చేయండి.

**SHAKTI TEXTILES AGENCY (AJ)**
**Post Box No-1138, Delhi-110 006.**



## నెరసిన జుట్టు

రంగులపెట్టి కాదు. మా 'శేఖరంజని' ఆయుర్వేదిక్ హెయిర్ ఆయిల్ నెరసిన జుట్టుకు మామూలు నల్లరంగు నిస్తుంది. పైగా అది మెదడుకు, కళ్ళకు మంచి టానిక్కు. ధర రు. 12/— సంతృప్తి, శాశ్వత ఫలితానికి 3 ఫియల్స్ రు. 27/—.

SHYAM AYURVED BHAVAN
P.O. KATRI SARAI (GAYA)



**దీర్ఘ వ్యాధులకు ఉత్తమ సిద్ధ వైద్యం!**



హస్త ప్రయోగం, అంగము చిన్నదై అవశుర కాలమంతు అసంతృప్తి, శుక్లనష్టము, నపుంసకత్వము, హెర్నియా, చర్మ వ్యాధులు, పోస్టు ద్వారా కూడా వైద్యం చేయబడును. వరిబీజము (బుడ్డ), మూత్ర వ్యాధులు ఆపరేషన్ లేకుండా రండి.

**డా॥ దేవర, ఫోన్ 551,**
**మార్వాడి గుడి వద్ద, తెనాలి.**

బ్రాంచి : 5/1, బ్రాడిపేట, గుంటూరు-2


మూగి తమాషా చూస్తున్న జనం ఏదో ఘోరం జరగబోతున్నదని వూహించి, ఎక్కడివాళ్ళక్కడ తప్పుకున్నారు. చుట్టు ప్రక్కల తెరచిన దుకాణాల షట్టర్లు క్రిందకు దించేశారు.

నలుగురు రహీమ్‌ని పట్టుకోగా గోపాల్ కత్తిని రహీమ్ కడుపులోదించాడు. నెత్తురు పిచికారిలా కొట్టింది. రహీమ్‌కి ప్రపంచమంతా గిర్రున తిరుగుతున్నట్లయింది. అంతా మసక మసకగా మారుతుండగా "అల్లా" అంటూ పెద్దగా ఒక అరపు అరచి రోడ్డుమీద కూలిపోయాడు.

* * *

ఐదు రూపాయల కోసం యింటికి వెళ్ళిన ప్రకాశ్ యింట్లో ఎవరో బంధువులొస్తే వాళ్ళతో మాట్లాడుతూ వెంటనే రాలేకపోయాడు. దాదాపు గంట తరువాత రహీమ్ కోసం వచ్చిన ప్రకాశ్ ఆ రోడ్డంతా నిర్మానుష్యంగా వుండటం గమనించాడు. అంతేగాక అంతకుముందు తెరచి వున్న దుకాణాలన్నీ మూసివున్నాయి. కొంచెం ఆశ్చర్యపోయాడు. అంత త్వరగా అన్ని దుకాణాలు మూయవలసిన అవసరం ఏమొచ్చిందో? ఇలా ఆలోచిస్తున్నంతలో పోలీసు కంట్రోలు వ్యాన్ అక్కడికి వచ్చింది

"ఇక్కడేం చేస్తున్నావ్? వెంటనే ఇంటికి వెళ్ళిపో" అని వ్యాన్ లోపలనుంచి కానిస్టేబులు కర్ర చూపించి అదిలించాడు.

ప్రకాశ్ మారు మాట్లాడకుండా అక్కడనుంచి కదిలాడు. ఏదో ఘోరమైన సంఘటనే జరిగివుండాలి ఇంతకు ముందు, అని అనుకుంటూ రహీమ్ ఇంటివేపుగా వెళ్లాడు.

ఇంటికి తాళం వేసివుంది.

ఎక్కడికి వెళ్ళారా అని ఆలోచిస్తుండగా ప్రక్క ఇంట్లో నుంచి ఎవరో బయటకు వచ్చారు.

"రహీమ్ ఘర్‌వాలా కహా గయా" హిందీలో ప్రశ్నించాడు ప్రకాశ్.

మొదట కొంచెం సంకోచించినా చివరకు మెల్లిగా "రహీమ్ కో కోయీ ఖూన్ కర్ దియా! ఉస్మానియా హాస్పిటల్‌కో లేకే గయా!" హిందీలో సమాధానం చెప్పారు.

"సచ్ హై క్యా?" అంటూ నమ్మలేనట్లు అతనివైపు చూశాడు.

"బిల్‌కుల్ సచ్ హై!" అని అనగానే ప్రకాశ్‌కి ఇక అక్కడ వుండబుద్ధికాలేదు. వెంటనే అటుగా వెళ్తున్న ఒక ఆటోని పిలిచి "ఉస్మానియా హాస్పిటల్ ఛలో" అన్నాడు.

హాస్పిటల్‌లో రహీమ్‌ను ఎమర్జెన్సీ వార్డులో వుంచారు. ఆపరేషన్‌కు సన్నాహాలు జరుగుతూ వున్నాయి. రహీమ్ మంచం ప్రక్కన వాడి తల్లి తండ్రీ కాకుండా పోలీసులు కూడ నిలుచుని వున్నారు. ఎమర్జెన్సీ గదిలోకి ప్రకాశ్‌ని పోలీసులు అనుమతించలేదు. అద్దాల కిటికీగుండా చూశాడు. స్పృహలేని స్థితిలో వున్నాడు రహీమ్. మంచంమీద దుప్పటంతా ఎర్రగా తడిసి వుంది.

ప్రకాశ్‌ను చూసిన రహీమ్ తండ్రి బయటకి వచ్చాడు. అప్పటివరకు ఆత్మీయులనేవారు ఎవరూ లేక దుఃఖాన్ని బలవంతంగా దిగమ్రింగుకుంటున్న రహీమ్ తండ్రికి ప్రకాశ్‌ను చూడగానే కన్నీరు కట్టలు తెంచుకుని ప్రవహించింది. ప్రకాశ్‌ను కౌగలించుకుంటూ "మేరా బేటా కా హాలత్ క్యా హోగయా దేఖో!" అంటూ బావురుమన్నాడు. ప్రకాశ్‌కి అతనిని ఎలా ఓదార్చాలో తెలియలేదు. కళ్ళ నీళ్ళ పర్యంతం కాగా చూస్తూ వూరకుండిపోయాడు.

* * *

సాయంత్రానికల్లా పరిస్థితి కొంచెం వుద్రిక్తంగా తయారయింది. అప్రమత్తంగా వుండవలసిందని సంఘటన జరిగిన చుట్టుప్రక్క ప్రాంతాల పోలీసు స్టేషన్లకు కంట్రోలు రూమ్‌నుంచి హెచ్చరిక అందాయి.

* * *

మరుసటి రోజు విద్యార్థులు స్కూళ్ళు, కాలేజీలు బహిష్కరించారు. ఉదయం నుంచి దుకాణాలు మూసి వేయించారు. అయితే తొలుత బంద్ జరుపదలచినవారు దీన్ని ముస్లిం వ్యాపార సంస్థలకు పరిమితం చేయదలిచారు. కాని కొందరు అన్ని దుకాణాలు, హోటళ్లు కూడా మూసివేయాలని పట్టుపట్టడంతో ముఖ్యంగా "పత్థర్ గట్టి" ప్రాంతంలో హిందువులు దుకాణాలు మూయడానికి తిరస్కరించడంతో ఘర్షణ మొదలయింది.

ఆ క్రిందటి రోజు పరిణామాలదృష్ట్యా నేడు విద్యార్థులవల్ల ఘర్షణలు జరిగే అవకాశం వుందని పోలీసులు భావించారు. అందుకు తగిన జాగ్రత్తలుకూడా తీసుకుని ఆయా ప్రాంతాల్లో పోలీసు బలగాలని మోహరించారు. అయితే వాళ్ళనుకున్నట్లుగాక వూహించని విధంగా ముస్లింలు, ముస్లిమేతరుల మధ్య ఘర్షణలు తలెత్తడంతో దిగ్భ్రాంతి చెందారు.


* * *

మధ్యాహ్నానికి పరిస్థితి మరింత ఉద్రి

త్రంగా తయారయింది. అంతేకాక వివిధ ప్రాంతాలకి ప్రాకింది.

మధ్యాహ్నం నుంచి పాత నగరంలోని వివిధ ప్రాంతాల్లో రాళ్ళు రువ్వడం. దుకాణాలు, యిళ్ళు తగల బెట్టడం. లూటీలు యథేచ్ఛగా జరిగాయి. మధ్యాహ్నం 12-30కు "నయాపూల్" వంతెనకు అవతలి వైపునుంచి చార్మినార్ వరకూ రోడ్లన్నీ రణరంగంలా కన్పించాయి. "కోఠీ" నుంచి ఏ తలుపు తెరచిలేదు. "మదీనా" హోటలు ప్రాంతంలోని రోడ్డంతా రాళ్ళతోనూ, గాజు ముక్కల తోనూ నిండివుంది. షో కేసుల్లో వుండ వలసిన నిలువెత్తు బొమ్మలు తల, మొండెం వేరె రోడ్డుమీద పడి వున్నై "జూబ్లీ" పోసాఫీసు మూసి వేశారు. 'చార్ కమాన్' ప్రాంతంలో ఎటు చూసినా పొగ కన్పించింది. సందులో యిరు వర్గాల మధ్య హోరాహోరీ పోరాటాలు సాగుతున్నాయి. భయభ్రాంతులైన ప్రజలు సురక్షిత ప్రాంతం చేరడానికి ఆరాటపడుతూ కన్పించారు.

అదే సమయంలో 'చార్మినార్' పోలీసు స్టేషను ప్రక్కనే వున్న మేడ దగ్ధమయింది. మొదటి అంతస్తులో ఒక స్త్రీ, నలుగురు పిల్లలు చిక్కుకుపోయారు. ఫైర్ ఇంజన్ కూడా అందుబాటులో లేకపోవడంతో 'డబుల్ డెక్కర్' బస్సుని తీసి కెళ్ళి దాని మీదకు దూకమని వారిని పోలీసులు కోరారు. ఈ రకంగా వారిని రక్షించారు.




రెయిన్ బజార్, మొఘల్ పురా, హుస్సేనీ ఆలం, చౌక్ మైదాన్, కామాటి పురా, దూద్ బౌలి, షాలిబండ, లాల్ దర్వాజా ప్రాంతాల్లో లూటీలు, దహన కాండలు జరిగాయి. కామాటిపురా పోలీసు స్టేషనుపై గుంపు దాడి చేసి కొన్ని ఆయుధాలను మందుగుండు సామగ్రిని ఎత్తుకుపోయారు. యాకుత్ పురా ప్రాంతంలో ఒక సబర్బన్ రైలుమీద దాడి జరిగింది. మధ్యాహ్నం చార్మినార్ వద్ద పోలీసులు అదుపు తప్పిన గుంపుపై కాల్పులు జరిపారు. పరిస్థితి అదుపుచేసే ప్రయత్నంలో ఇద్దరు పోలీసు డిప్యూటి కమిషనర్లకు రాళ్ళదెబ్బలు తగిలాయి. ఒక ఇన్ స్పెక్టరుకు కత్తిపోట్లు, మరో ఇన్ స్పెక్టరుకు తలమీద బలమైన గాయాలు తగిలాయి. ఉస్మానియా జనరల్ ఆసుపత్రిలో అరవై ఎనిమిదిమంది క్షతగాత్రులు చికిత్సకోసం చేరారు. వారిలో ఐదుగురికి తుపాకీగుండ్లు తగిలాయి. ముగ్గురు పరిస్థితి ప్రమాదకరంగా వుంది.

దౌర్జన్యానికి దిగిన గుంపులపై ఐదు ప్రాంతాల్లో పోలీసులు జరిపిన కాల్పుల్లో పదిహేను మందికి పైగా మరణించారు. వందకు పైగా గాయపడ్డారు. మొత్తం 106 దుకాణాలు లూటీ చేయబడ్డాయి. 36 దుకాణాలు దగ్ధమయ్యాయి. కార్చిచ్చులా అలజడులు ఇతర ప్రాంతాలకి విస్తరించడంతో 'కోఠీ' నుంచి హైద్రాబాదు పాత నగరం అంతా మధ్యాహ్నం గం|| 2-30 నుంచి నిరవధికంగా కర్ఫ్యూ విధించారు. రాత్రి వరకు మొత్తం మూడు వందల

ప్రశాంత్ ఎంత సహృదయుడో ఆమె అంత ప్రేమికురాలు వారి మధ్య గాలికి కూడా చోటు లేదు. అయినా వారి మనసులలో రేగిన అంతః సంఘర్షణలకు అపురూప కల్పనే—

యద్దనపూడి సులోచనారాణి నవల

సహజీవనం

వెల: 14 రూ.

అన్ని షాపుల్లోనూ దొరుకుతుంది. లేదా - 1 రూపాయి తగ్గించి M.O. చేయండి. ఆ రూపాయికే V.P. పంపుతాము!

వివరాలకు: క్వాలిటీ పబ్లిషర్సు రామమందిరం వీధి విజయవాడ-2

# మల్లెపందిరి

## శౌర్యస్తవం

శ్రీచక్రుడనే కవి ఒక రాజు శత్రువుతో యుద్ధం చేసే సందర్భంలో అంటున్నాడు :

"మనం శత్రు సంహారం పూర్తి చేయగానే ఈ నదిని దాటి వెళ్ళడం మంచిది. ఆలస్యం చేస్తే ప్రమాదముంది. శత్రువుకంటె ఈ ఆపద దాటరానిదై పోతుంది."

నేతుం నౌభిరిభా నయాంతి దృతిభిస్తార్యాః కియంతో హయాః
తజ్జానుద్వయసేన దేవ పయసా సైన్యం సముత్తార్యతాం
నో చేద్భంగ భయద్రుతారి వనితానేత్రప్రణాలీలుఠత్
బాష్పాంభః ప్లవపూరితోభయతటీ ద్రాగ్వర్త్స్యతీ రావతీ॥

ప్రస్తుతం విజయం పూర్తయింది. ఇక తొందరపడాలి. ఎందుకంటే తీసుకెళ్ళాలంటే ఏనుగులు నావలమీద రావు. తోలుబుంగల్లో ఎన్ని గుర్రాలను దాటించగలం? ఈ నది ఇంకా మోకాటి బంటిగా ఉండగానే సైన్యం దాటించేయడం మంచిది. లేకపోతే కొద్దిసేపట్లో ఓడి పారిపోయిన శత్రు స్త్రీల కండ్లనాళాలనుంచి జారిన కన్నీటి వరదతో ఈ ఐరావతీ నది ఒడ్డులు ఒరుసుకుంటూ ప్రవహించవచ్చు.

—సౌభరి

అరవై మందిని పోలీసులు నిర్బంధంలోకి తీసుకున్నారు. కర్ఫ్యూ సమయాల్లో లూటీ, దహనకాండలకు పాల్పడుతూ కన్పించిన వారిని కాల్చి వేయమని ఉత్తర్వులిచ్చారు. అధికారులకు తోడ్పడడానికి సర్వ సన్నద్ధంగా వుండవలసిందిగా సైన్యాన్ని హెచ్చరించారు.

* * *

"పాత నగరంలో లూటీలు. దహనకాండ. కర్ఫ్యూ విధింపు."

"నగరంలో ఐదుచోట్ల కాల్పులు. కొన్ని ప్రాంతాల్లో నిరవధికంగా కర్ఫ్యూ."

"కర్ఫ్యూలో కనపడితే కాల్చివేయమని వుత్తర్వులు."

ఏ పేపరు చూసినా మొదటి పేజీలో తాటి కాయంత అక్షరాల్లో యివే వార్తలు. అంతకుముందు రోజు హైద్రాబాదువరకే పరిమితమైన అల్లర్లు, దౌర్జన్యకాండ నేడు సికింద్రాబాద్‌కు వ్యాపించింది. ముషీరాబాదులో "మసీదు"ను తగులబెట్టడానికి ప్రయత్నిస్తున్న గుంపుపై పోలీసులు కాల్పులు జరిపారు. ఆ కాల్పుల్లో గాయపడిన యిద్దరిని ఆందోళనకారులు తీసుకొనిపోయారు. ఆ వ్యక్తుల ఆచూకీ పోలీసులకి అంతుపట్టలేదు. ముషీరాబాదునుంచి కవాటిగూడ, బోయగూడ, సికింద్రాబాదు, అటునుండి చిక్కడపల్లి, విద్యానగర్, లాలాగూడ ప్రాంతాలకి విస్తరించింది. అంతేగాక పరిశ్రమలున్న "సనత్‌నగర్" ప్రాంతంలో కూడా అల్లర్లు మొదలయ్యాయి. ప్రజలు భయంతో వారి వారి ఇళ్ళ కిటికీల్లోంచి మేడల పైనుంచి పరిస్థితిని గమనిస్తున్నారు.

కవాటిగూడ, బోయగూడ ప్రాంతాల్లో గృహ దహనాలకు పాల్పడిన గుంపుపై పోలీసులు కాల్పులు జరిపారు. సికింద్రాబాదులో ఒక దేవాలయంపై ధాడి చేయబోతున్న వారిని హిందువులు అటకాయించడంతో ఇరువర్గాల మధ్య ఘర్షణ మొదలైంది. రాళ్ళు, కత్తులు, కర్రలు, నాటు బాంబులు యధేచ్ఛగా వాడబడ్డాయి. యుద్ధ రంగంలా తయారయిన ఆ ప్రాంతంలో పోలీసులు కాల్పులు జరుపగా అనేక మంది ప్రాణాలు కోల్పోయారు. మధ్యాహ్నం 1-30 నుంచి సికింద్రాబాదులో కూడా నిరవధికంగా కర్ఫ్యూ విధించారు పరిస్థితులు విషమిస్తుండంతో. అయినా లాభం లేకపోయింది. కర్ఫ్యూలో కూడా యధేచ్ఛగా లూటీలు, దహన కాండలు జరగసాగాయి. పరిస్థితి పోలీసుల చేయి దాటిపోవడంతో సి. ఆర్. పి., రిజర్వు దళాలను మెదక్ జిల్లా, మహబూబ్‌నగర్ జిల్లాలనుంచి ప్రత్యేకంగా పిలిపించి రంగంలోకి దింపారు. అంతకుముందు లూటీ, దహనకాండలు చేస్తున్నవారిని కాల్చి వేయమని యిచ్చిన వుత్తర్వులను మార్చి మనిషి కనబడితే కాల్చి వేయమని వుత్తర్వులిచ్చారు. వైర్‌లెస్ మెసేజిలో ఆరు ప్లాటూన్ల సైన్యాన్ని "నాగ్‌పూర్"నుంచి పంపవలసిందిగా ఆదేశాలిచ్చారు. ఎవరిండ్లలో వాళ్ళు ప్రాణాలరచేతిలో వుంచుకుని యెప్పుడు యెటునుంచి ఎలా ఆపద ముంచుకొస్తుందోనన్న భయంతో గజగజ లాడి పోసాగారు.

* * *

మరుసటి రోజు పేపర్లు వెలువడలేదు. వెలువడినా కొనేవారెవరూ లేరు. నాగ్‌పూర్ నుంచి వచ్చిన సైన్యం జంట నగరాలను హస్తగతం చేసుకుని మెషిన్‌గన్లతో గస్తీ తిరుగుతున్నారు. అప్పటివరకు రెండువేలమందిని అదుపులోకి తీసుకున్నారు పోలీసులు. ఆ రెండు రోజుల్లో నూటయాభై మంది మరణించారని, ఐదు వందలదాకా గాయపడ్డారని పోలీసుల కథనం. కానీ ఇంకా ఎక్కువగానే వుంటుందని పౌరుల అంచనా.

* * *

మూడోరోజుకి పరిస్థితి కొంత అదుపులోకి వచ్చింది. కర్ఫ్యూని ప్రొద్దున ఏడు గంటలనుంచి తొమ్మిదిగంటలవరకు సడలించారు. అయినా ఆ రెండు గంటలలో చెదురు మదురు సంఘటనలు చెలరేగడంతో మళ్ళీ నిరవధికంగా జంట నగరాల్లో కర్ఫ్యూ విధించారు.

* * *

ప్రకాశ్ ఇంట్లో కూర్చుని రహీమ్ పరిస్థితి ఎలా వుందో అని ఆలోచిస్తున్నాడు. చుట్టూ అమ్మ, నాన్న, అక్కా, చెల్లెలు అందరూ కూర్చుని వున్నారు. ఇంతలో ఎవరో తలుపుమీద టకటక శబ్దం చేశారు. అందరూ ఒక్కసారిగా ఉలిక్కిపడ్డారు. ప్రకాశ్ అక్కా, చెల్లెలు ఒకరి నొకరు కౌగలించుకున్నారు భయంతో.

"ఎవరు?" గట్టిగా అన్నాడు ప్రకాశ్.

"పోలీస్!" బయటనుంచి జవాబు.

ప్రకాశ్ వెళ్ళి తలుపు తెరిచాడు.

"ఈ ఇంట్లో ప్రకాశ్ ఎవరు?" ప్రశ్నించాడు సబ్ ఇన్‌స్పెక్టరు.

"నేనే" అన్నాడు.

"అయితే వెంటనే మాతో రండి. మిమ్మల్ని ఒక్క గంటలో మళ్ళీ మీ

ఇంట్లో వదలిపెడతాం."

"ఎందుకు?" అని ప్రశ్నించాడు ప్రకాశ్ భయపడుతూ.

"అదంతా మీ కనవసరం" కరకుగా వచ్చింది సమాధానం.

ఇక వాళ్ళతో మాట్లాడి ప్రయోజనం లేదని "నడవండి" అన్నాడు ప్రకాశ్.

"మేం వెళ్ళగానే తలుపులు గడియ వేసుకోండి" ఆజ్ఞాపించాడు సబ్ యిన్‌స్పెక్టరు.

ప్రకాశ్‌ను పోలీసులు జీప్‌లో యెక్కమన్నారు. ప్రకాశ్ జీప్ యెక్కగానే జీప్ కదిలింది.

ప్రకాశ్ యింట్లోవాళ్ళు తలుపులు వేసుకుని అందరూ ఒక్కసారే బావురుమన్నారు.

*   *   *

తనని ఎక్కడికి తీసుకెళుతున్నారో అంతుపట్టలేదు ప్రకాశ్‌కి. అయినా ఏం మాట్లాడలేదు. ఎలాగో యింకొంచెంసేపటిలో తెలుస్తుంది.

జీపు ఉస్మానియా జనరల్ ఆసుపత్రివద్దకు వెళ్ళి ఆగింది.

ప్రకాశ్‌ని రహీం వున్న రూమ్‌లోకి తీసికెళ్ళారు.

అక్కడ రహీమ్ వాళ్ళ తల్లితండ్రులే కాకుండా, ఇద్దరు డాక్టర్లు, ముగ్గురు నర్సులు, పోలీసు వున్నతాధికారులు వున్నారు.

ప్రకాశ్ ఆత్రుతగా రహీమ్ దగ్గరకు వెళ్ళాడు. "రహీమ్, నేను ప్రకాశ్‌ను— ఒక్కసారి కళ్ళు తెరు" అన్నాడు.

రహీమ్ కళ్ళు తెరవలేదు. డాక్టర్లు శతవిధాల ప్రయత్నించసాగారు రహీంకి స్పృహ తెప్పించడానికి. అరగంట తరువాత డాక్టర్ల శ్రమ ఫలించింది. రహీం కొద్దిగా కళ్ళు తెరిచాడు.

నోటోనుంచి "ప్ర....కా....శ్" అనే పదం అతి కష్టంమీద వచ్చింది. ప్రకాశ్ రహీమ్ చేతిలో చేయివేస్తూ "నేనిక్కడనే వున్నాను రహీమ్ చెప్పు! ఏం కావాలో!" అంటూ రహీమ్ కళ్ళల్లోకి చూశాడు వంగుతూ.

"పందెం డబ్బులు" నూతిలో నుంచి వచ్చినట్లుంది స్వరం.

గబుక్కున జేబులో నుంచి పది రూపాయల నోటు తీసి చేతిలో వుంచాడు. రహీమ్ గుప్పిళ్ళు మూసుకున్నాయి.

రక్తం ఎక్కిస్తున్న బాటిల్ ఖాళీ అవడంలో నర్సు కంగారుగా డాక్టరుతో "ఆ గ్రూపు రక్తం అయిపోయింది. ఇప్పుడేం చేయమంటారు?" డాక్టరు ప్రశ్నార్థకంగా నర్సువైపు చూశాడు.

నర్సు మాటలు విన్న ప్రకాశ్ డాక్టరు దగ్గరకు వస్తూ - "డాక్టర్! నా గ్రూపు, వాడి గ్రూపు ఒకటే. కావాలంటే పరీక్ష చేసుకుని తీసికోండి" అన్నాడు. ఆశ్చర్యంగా చూశాడు డాక్టరు ప్రకాశ్‌వైపు. పరీక్షచేసి గ్రూపు ఒక్కటే కావడంతో ఒక బాటిల్ రక్తాన్ని తీసుకున్నారు.

"ఆశ్చర్యం" అంతే. అది విధి విచిత్రం బయట హిందు, ముస్లింల హోరాహోరీ పోరాటం ఒక ప్రక్క, మరొకప్రక్క దానికి కారకులైన వారి రక్త దానంతో మృత్యు పోరాటం."

ఒంట్లో నీరసంగా వుంది. ప్రకాశ్ కళ్లు మూతలు పడుతున్నవి. డాక్టర్లు ప్రక్కనే ఇంకొక మంచం వేయించి ప్రకాశ్‌ను విశ్రాంతి తీసికొమ్మన్నారు. రహీమ్‌కు అప్పుడప్పుడు తెలివివస్తూంది, మళ్ళీ వెంటనే పోతూంది. తెలివి వచ్చినపుడు ప్రకాశ్ ఒకసారి దగ్గరగా వెళ్లాడు.

రహీమ్ పేలవంగా చూస్తూ ప్రకాశ్ చేతిని పట్టుకుని: "పందెం ఇంకెప్పుడూ ఎవరితోనూ కాయకు." ఆమాట లనడానికి అయిదు నిముషాలు పట్టింది రహీమ్‌కు.

"జన్మలో యింకెప్పుడూ, యెవ్వరితోనూ పందెం కాయను" అంటూ ప్రతిజ్ఞ చేశాడు కళ్ళనీళ్ళతో ప్రకాశ్.

దుఃఖం ఆపుకోలేక యింక అక్కడ క్షణం నిలువలేక ప్రక్కకు వచ్చేశాడు ప్రకాశ్.


మరో అరగంటసేపు రహీమ్ మృత్యువుతో హోరాహోరీ పోరాడి విజయం సాధించలేక అనంత వాయువుల్లో కలిసిపోయాడు.

మృత్యువుతో విజయం సాధించలేకపోయినా పందెంలో 'నేనే గెలిచాను!' అన్న దానికి ఋజువుగా పది రూపాయల నోటు అతని చేతిలో బిగుసుకుని పోయింది.

"పందెం ఖరీదు....?" మనసులోనే గొణుక్కున్నాడు ప్రకాశ్. ★

---

# కొంగలకు రక్షణ



మధ్య యూరపు ప్రాంతంలో కొంగజాతి పక్షులు పూర్తిగా అంతరించనున్నాయి.

గతంలో యీ పక్షులు యిండ్ల కప్పుల మీద, చర్చి గోపురాలలోను గూళ్ళు కట్టుకుని నివసిస్తూ కనిపించేవి. ప్రస్తుతం యివి జూలలోను, పార్కులలో మాత్రమే కన్పిస్తున్నాయి. ఇవి పశ్చిమ జర్మనీలో కేవలం నూరు జతలు మాత్రమే వున్నట్టు తెలుస్తున్నది. జర్మనీలోని పక్షుల సంరక్షక సంఘంవారు వీటి రక్షణ కొరకు కృషి చేస్తున్నారు. ఈ కొంగలను అడవులలో వదిలివేయాలనీ, వాటి కోసం ప్రత్యేక వాసస్థలాలను నిర్మించాలని వీరు కోరుతున్నారు. గ్రామస్థులు వీటికి తగినంత ఆహారం- అందించాలని కూడా వీరు కోరుతున్నారు.